

# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**పద్మావతి కళ్ళజోడు** పై నుంచి కాస్తా ఆందోళనగా చూసింది, ఆస్తి రహస్యాలు ఆ ఆగంతకుడి చెప్పేస్తాడేమో అన్నట్టు. దగ్గింది. భర్త "ఫరవా లేదు," అన్నాడు. ఆమెలో ఆందోళన తగ్గినట్టు అనంతం భావించాడు. ఆమె ఆందోళనకు కారణం తనను భర్త త్వరగా పంపించెయ్యడేమో అని కావొచ్చు అనుకున్నాడు అనంతం. నా ఈజీవితం ముసలితనం అడుగు పెట్టకుండా కడతేరి పోతే బాగుండు అనికూడా అనుకున్నాడు.

"ఆ అబ్బాయి సంగతి తేల్చి పంపండి," అనింది పద్మావతి.

"నేను ఆ విషయం క్షణంలో తేల్చనంతమాత్రాన దాని గురించి ఆలోచించడం లేదు అనుకోకు," అని దగ్గాడు.

"చిన్న విషయాల గురించి బుర్ర ఖరాబు చేసుకోడం ఎందుకూ? ఇవ్వ దలచుకుంటే ఇవ్వడం లేక చూస్తా అనడం; ఇవ్వదలచుకోక లేక ఇచ్చే వీలు లేకపోతె వీల్లేదు ఏమనుకోకా అనెయ్య వచ్చుగా?"

"నీవు చెప్పిన సమాధానాలు నేను చెప్పలేను అని అనుకోకు. మోహిని గారు పంపారు. ఆమె మాట కాదనగలమా? ఆమె పేరుకు తగ్గట్టు అందంగా ఉంటారు. పిల్లలు లేరు పాపం."

"మీరు ఇబ్బందిపడి మరీ నాకు ఉద్యోగం ఇవ్వక్కరలేదు లెండి."

"భలేవాడివి, అనంతం; మాలో మేము మాట్లాడుకునే మాటలను నీవు పట్టించుకోడం ఏమి సంస్కారం? మోహిని దగ్గిర నా పరువు పోదా? గవును వేసుకునే నాటి నుండి నాకు ఆమె తెలుసు. నేను ఎత్తుకు తిప్పేవాడిని. రెండు మూడు సార్లు నా చొక్కా పాడుచేసిన జ్ఞాపకం."

ఆమె దగ్గింది.

"సరే ఆ విషయాలు అప్రస్తుతం."

"నా పరిస్థితి చూసి మీతో మాట్లాడి చూస్తానన్నారు."

"ఆమె బంగారు పోత విగ్రహంలా ఉంటారు; పిల్లలు లేరు పాపం. ఆమె చాలా మంచి పని చేసిందని నా అభిప్రాయం; ఏమంటావు, పద్మా?"

ఆమె ఏమీ మాట్లాడ లేదు, అనంతాన్ని చదువుతూ.

"ప్రత్యక్షంగా ఆమకు ఏదన్నా సాయం చేసే అవకాశం ఇన్నేళ్లకు మాకు కలిగింది. ఆమె మాకు ఉపకారం చేసినట్టు భావిస్తున్నా; కదా, పద్మా?"

ఈ సారీ ఆమె ఎందుకో మాట్లాడలేదు.

"ఆమె మాకు ఎన్నో సార్లు సలహాల రూపాలలో సాయం చేసింది. మేధావిలా కనిపించని మేధావి; మంచితనం కనిపించని మంచి మనిషి. అరుదైన స్త్రీ. బాగా చదువుకున్న మనిషి. సింహాద్రి కోతైతే ఆమె కొబ్బరికాయ. పిల్లలు లేరు."

"ఆమె నలభైకి ఇంకా చేరుకోలేదు; పిల్లలు పుట్టారా ఏమి? ఆమె గురించి ఈ అబ్బాయికి అనవసరం; కావలసింది ఉద్యోగం."

"కాదన్ను. శరభ ఏమిటంటాడో కనుక్కుంటా. అతన్ని ఒప్పించడం కన్నా యముడిని ఒప్పించడం తేలిక."

"కంపెణీ మనదా శరభదా?"

"మనది కాదని అనలేదు. తన సొంత కంపెనీలా చూసుకుంటూ వ్యాపారాన్ని నిలబెడుతున్నాడు గదా?"

"పైసా మనకు రానప్పుడు ఆ వ్యాపారం ఉంటేనేమి లేకపోతేనేమి?"

"నీ కోపం ఎప్పటికీ తగ్గదు, పద్మా; ఎదురుగా ఎవరున్నారా అనికూడా చూడవు."

"శరభంతో మాట్లాడి తేల్చండి."

"మా దగ్గిరవి ఏమి ఉద్యోగాలయ్యా? కడుపు నిండదు, కాలు నిండదు. గొర్రె తోకలా జీవితాంతం మిగిలిపోతావా? మా జేబులు, గల్లాపెట్టెలూ నింపుకోడానికి వ్యాపారం చేస్తాము గాని పెద్ద జీతాలిచ్చి ఉద్యోగ కుటుంబాలను ఆదుకోడానికి కాదు. కదా?"

కదా? కు ఏమి సమాధానం ఇవ్వాలో అనంతానికి తెలీక తెల్ల ముఖం వేశాడు. అవును అని కానీ, కాదు అని కానీ సమాధానం ఇవ్వలేని మోసగొట్టు ప్రశ్న. దానికి సమాధానం ఇవ్వక్కర్లేదని గ్రహింపుకొచ్చి ఊరట చెందాడు. గోయల్ తెలివి తక్కువ వాడిలా కనిపిస్తున్న తెలివైన వాడని అనంతానికి అర్థమయింది. మోహిని ఈ సిఫారసు చేసి మరి కొంత శిక్ష తనకు విధించిందా? మార్జాల మోసం; మేధావి కదా?

"మేము బొంబాయి వెళ్ళిపోదామన్న ఆలోచనలో ఉన్నాము. నా మొదటి యాభై ఏళ్ళ బతుకూ అక్కడ గడిచింది. శేష జీవితం అక్కడ ముగియడం మేలని నా భార్య పద్మ అంటోంది. నా వ్యాపారంలో పాలు పంచుకోదు గాని, మేధా

సంపత్తిగల అనుకూలవతి. మేధ కలిగి ఉండటం వేరు, అనుకూలంగా ఉండటం వేరు. అక్కడ మాకు వేలాది బంధువులున్నారు; పిలవక పోయినా పలుకుతారు. మందలోనే పశువుకు భద్రతా, సుఖం. కదా?"

"కావచ్చండి."

"శరభయ్యనే ఉద్దండుడికి వ్యాపార బాధ్యతలు పూర్తిగా అప్పగించి కృష్ణా రామా అనుకుంటున్నా. డబ్బుకు ఎంతకాలమని దాస్యం చేయడం? అతనికి వామన అనే సమర్థుడు చేదోడూ వాదోడుగా ఉంటాడు. కృష్ణార్జునులు లాంటి వాళ్ళు. నేను చేసే వ్యాపారంలో వేలు పెట్టాల్సిన అవసరాన్ని వాళ్ళు ఏమాత్రం ఇవ్వరు. అది పద్మకు నచ్చక పోవచ్చు – వేరే విషయం. పైగా శరభ నేను చెప్పినా ఒక్కోసారి తనకు నచ్చకపోతే చెయ్యడు; అలా అని చెయ్యనని చెప్పడు నా మాట మీది గౌరవం కొలది."

"నేను ఒస్తానండీ."

"నేను వెళ్ళు అని చెప్పలేదనుకుంటానే? మోహిని చెప్పిన తరువాత నేను నిన్ను రిక్త హస్తాలతో పంపితే నా అంతరాత్మ వేధించి చంపుతుంది. మోహిహనంటే పద్మకు కూడా చాలా ఇష్టం. నీలో రోగాలు కుదిర్చే గుణం ఉన్నట్టుంది. మన్మథుడిలా ఉన్నావు. నీతో మాట్లాడుతుంటే ఊరటగా ఉంది. పద్మకేలా ఉందొ నాకు తెలియదు."

ఆమె తన ముందు గల బల్ల మీది చూర్ణం ఏదో తీసుకుని కణతలకు పూసుకుంది; మళ్ళీ కళ్ళ జోడు తగిలించుకుని అనంతాన్ని చూడటం మొదలుపెట్టింది. అతని మాటలు, ఆమె చూపులు తనను మరో పావుగంటలో రోగంపాలు చేయవు కదా?"

ఆమె శరభయ్య నెంబరు కొట్టి భర్తకిచ్చింది. అవతలి నించి అతను గోయాలుకూ, పద్మావతికి కూడా నమస్కారాలు చెప్పి ఎంతవరకూ విధేయంగా మాట్లాడ వచ్చో అంత వినయంగాను మాట్లాడటం మొదలుపెట్టాడు ఆరోగ్య విషయాలతో సహా.

"ఏమీ లేదు, శరభయ్యా. మా కుటుంబానికీ, మోహిని గారని ఆమె కుటుంబానికి చిరకాల స్నేహం. నిజానికి ఆమె చిన్నపుడు ఆమెను ఎత్తుకుని ముద్దుచేశాను. ఇప్పుడు ముప్పై అయిదేళ్లో మరో రెండేళ్లు అధికంగా ఉన్నా ఆశ్చర్యపడను. ఆమె మేధోపరంగా మీతో సరితూగే కలదు; ఆవిధంగా సాయం చాలా సార్లు చేసింది కూడా. చేసిన మేలు మరువ రాదు అని మీరు చాలా సార్లు నాకు చెబుతుంటారు; పైగా పాప భీతి మీకు అధికం కూడాను. ఆమె తనకు తెలిసిన బంధువులబ్బాయికి మన కంపెనీలో ఉద్యోగం ఇవ్వడానికి వీలుంటుందా అని దీనంగా అడిగింది. ఆమె ఎవరినీ ఏదీ అడగని మొహమాటి. శరభ గారిని అడిగి ఏ విషయం చెబుతానన్నాను. మనకు వీలుంటుందంటారా? ఆ అబ్బాయి చూడటానికి బాగుండడమే కాక చాలా తెలివైన వాడు; మీ లాగే తానూ నిజాయితీపరుడనిపిస్తోంది. రెండు సార్లు, మీకు ఇబ్బందికరమైతే నాకు ఉద్యోగం అక్కరలేదని అతను లేచిపోతే రెండు సార్లూ కూర్చోపెట్టాను. ఉద్యోగం ఇవ్వకపోతే మోహిని గారు బాధపడతారు. కదా?"

శరభయ్య ఏమి చెపుతున్నాడా అన్న ఆత్రుతతో గోయలగారి ముఖంలోకి చూస్తూ ఓపికగా కూర్చున్నాడు అనంతం. పద్మావతి అనంతాన్నిచూడటం మాని, తల ఎత్తి, బొమ్మలా భర్తమోహంలో అవతల మాట్టడేది అక్షర రూపంలో కనిపిస్తున్నట్టు చూస్తోంది. శరభ ఒక అల్ప ఉపన్యాసం ఇచ్చినట్టున్నాడు. ఫోను కట్టేసిన తరువాత గోయల్ మౌనంగా ఉండిపోయాడు; శరభను తీసేసి మరొకడికి వ్యాపారం ఇస్తే పోతుందన్న ఉద్రేకంతో బాధపడుతున్నాడా తన భర్త అని భావించింది. భావించి అతను ఉద్రేక పడుతున్నందుకు ఆందోళనతోను, భర్త తెగించి ఆ పని చేసే అవకాశం ఉందన్న కించిత్ సంతోషంతోనూ గడుపుతూ సీసాలోని చూర్ణాన్ని వాసన చూసి మూత గట్టిగా బిగించింది.

"అనంతం, నీ అదృష్టం కొలదీ, నా అదృష్టం కొలదీ శరభయ్య నిన్ను పంపమన్నాడయ్యా. నీతో మాట్టాడి, నిన్ను చూసి ఒక నిర్ణయం తీసుకుంటాడు. నా అదృష్టం ఇందులో ఏముంది అని నీకు అనుమానం రావచ్చు. మోహిని దగ్గిర నా మాట పోకుండావుండే సదావకాశం కనిపించడం వలన. శరభంలో గొప్ప లక్షణం అదే. నిస్వార్థ పరుడు; సొంత భార్య ఉద్యోగం ఇవ్వమని అడిగినా ఇవ్వడు. నా శ్రేయస్సుకన్నా కూడా కంపెనీ శ్రేయస్సు అతనికి ముఖ్యం."

గోయాలు గారు ఏదో బాధను దిగమింగుకుంటూ ఆ మాటలన్నారని అనంతానికి అనిపించి జాలి కలిగింది; డబ్బుతో పులిసి ఉన్న వాళ్ళను చూసి జాలిపడ కూడదని ఎక్కడా లేదు.

"అనంతం ఇప్పుడేవెళ్లి నీవు శరభాన్ని కలువు. అతను ఉద్యోగం ఇస్తే నువ్ నన్ను కలవక్కర్లేదు; ఇవ్వకపోతేనే రా. వ్యాపారం నాది కదా అని అహానికి పోయి సమర్ధుడైన రథసారథిని తప్పించి వ్యాపారాన్ని నష్టపెట్టుకోడం మూర్ఖత్వం. కదూ?"

"అవునండీ!"

“గోయల్ గారు ఎలా తెలుసు?"

చెప్పాడు.

"ఇంతకూ ముందు ఎక్కడన్నా పనిచేశావా"

చెప్పాడు.

"ఎందుకు మానేసినట్టో?"

"మానెయ్య లేదండీ, వాళ్ళే తీసేశారు."

"కారణం?"

"నా పని తీరు వాళ్లకు నచ్చ లేదు."

"దాన్ని మార్చుకుని ఉండొచ్చుగా?"

"మార్చుకునే అవకాశం లేక పోయింది; దానికి వీలూ లేదు, వాళ్ళు ఆ అవకాశం ఇవ్వలేరూ కూడా."

"నీ తీరు, మాటలూ కొంచం పుల్ల విరుపుగానూ, అర్థం చేసుకోవడం కష్టం గానూ ఉన్నాయి. వాళ్లకు నచ్చని నీ పని తీరు నాకు నచ్చుతుందని అనుకుంటున్నావా? కేవలం గోయల్ గారు సిఫారసు చేశారు కదా అని నీ పని తీరు నచ్చకపోయినా నేను ఉంచుకో లేను. ఆయన  నా యజమాని కావచ్చు; యజమానులకన్నా నాకు నా ధర్మం ముఖ్యం."

"ఇంతకుముందు నేను పనిచేసిన వాళ్ళ  అభిప్రాయానికి మీ అభిప్రాయానికీ తేడావుంటుందని నా అభిప్రాయం."

"లోపం వాళ్ళ అభిప్రాయంలో ఉందిగానీ నీ పని తీరులో కాదు అని నీ అభిప్రాయమా?"

"మీరూ వాళ్ల అభిప్రాయానికి వస్తే తప్పు నాలో ఉందని అంగీకరించడానికి నేను సిద్ధమేనండీ."

"నీ పుల్ల విరుపు మాట తీరు చూస్తుంటే వాళ్లకు అది నచ్చకపోయుండొచ్చు  అన్నది నా తాత్కాలిక అభిప్రాయం."

"వాళ్ళు మీరిచ్చినట్టు మాట్లాడే అవకాశమే నాకు ఇవ్వలేదు. మీరు ఇస్తున్నారు అందువల్ల కనీసం మీరు నావి పుల్ల విరుపు మాటలన్న తాత్కాలిక అభిప్రాయానికి వచ్చారంటే అందులో నాకు దోషం కనబడటం లేదు."

"నేను నీకు నువు చెప్పాల్సింది చెప్పడానికి అవకాశం ఇచ్చానా, నువ్వే నా దగ్గిర తీసుకున్నావా?"

"రెండూనూ అని అనుకుంటున్నా. ఒక వేళ నేను అలా తీసుకున్నానని భావిస్తే దాన్ని తప్పుగా అనుకుంటే మీకు ఆ స్వేచ్ఛ ఉంది."

"నేను నీకు ప్రశ్నలు వేయడం వలన, వాటికి నువ్ సమాధానాలు ఇవ్వడం వలన నీ గురించి నువ్వు నాకు తెలియజెయ్యడానికి వీలైంది, అంతేనా?"

“అంతేనండీ."

"వాళ్ళ లాగే నాకూ సంజాయిషీలు అడక్కుండా పని లోనుంచి తీసివేసే హక్కుందికదా?"

"హక్కు సంగతెలా ఉన్నా – సంజాయిషీ అడిగి తీసేసినా, అడక్కుండా తీసేసిన ఉద్యోగం పోతుంది."

"వాళ్ళు తీసేసినపుడు బాధపడలేదా?"

"బాధపడ్డాను; బాధవల్ల ఒరిగేదేమీ ఉండదు కదా. అందుకే భరించాను బాధను."

"వాళ్ళ మీద కోపం రాలేదా?"

"ఎవరు అన్యాయంగా అధికారాన్ని చెలాయించినా ఎవరికైనా కోపం వస్తుంది. కానీ కోపం వచ్చిన వాళ్ళ మీదల్లా ప్రతీకారం తీసుకోలేము; అవకాశం ముఖ్యంగా ఉండదు. ఉన్నా 'పోనీలే' అని కొట్టి పారేయవొచ్చు."

"సత్యం మాట్టాడదామన్న సదుద్దేశంతో ఉద్యోగంలోకి తీసుకోబోతున్న వ్యక్తితో నిస్సంకోచంగా మాట్టాడుతున్నావా; నీవు సత్యసంధుడివని నాకు నిరూపించుకుని నా మెప్పుగురించి మాట్లాడుతున్నావా?"

"నాకు ఇలా మాట్టాడటం ఇష్టం. అంతే. ఎంత వారకూ వీలుంటే అంతవరకూనూ."

"అంటే వీలున్నంత వరకూ నిజం మాట్లాడతాను; వీలు లేకపోతె అబద్దాన్ని ఆశ్రయిస్తాను అని అంటున్నావని భావించ ఒచ్చా?"

"అబద్ధమూ కష్టానికి దారితీస్తుంది. అబద్ధమూ భయంకరమైనది. అబద్ధాలు మాత్రమే ఆడుతుండటంవలన క్షేమంగా, సుఖంగా ఉండగలమని అనుకోలేము. జీవించడానికి నిజమూ అబద్ధమూ అవసరమే. ఏది మాటాడినా స్వక్షేమగురించే కాక అవతలి వాడికి దాని వలన హాని జరుగుతుందేమో అన్న విషయాన్ని గమనికలో ఉంచుకో వాలి. జీవితంలో అబద్ధం ఆడవలసి వచ్చే సందర్భాలకన్నా, నిజాలు చెప్పే వీలున్నవే అధికంగా ఉంటాయి. ఎటొచ్చి అబద్ధం ఆడకుండా ఉండాటానికి క్లిష్ట సమయాల్లో కూడా వీలు ఉండకపోదేమో," అనంతం అన్నాడు.

"నిజం చెప్పడానికి సృజనాత్మకత అవసరం లేదు; అబద్ధానికి అది కావాలి. సృజనాత్మకత అంటే కళగా భావిస్తే అబద్ధం, అంటే కళ ఆనందాన్ని ఇవ్వకపోదు. మోసం చేయడంలో ఒక ఆధిక్యతను ప్రదర్శించడం కూడా ఉంది. కనుక, అవసరం లేకపోయినా కేవలం ఆ కళ కలిగించే ఆనందం గురించీ అబద్ధాలు ఆడేవాళ్ళు లేరా?"

"ఉంటారు. కళ వల్ల లోక కళ్యాణం జరగాలిగాని ఎవడూ నష్టపోకూడదు, కలత చెందకూడదు."

"ఒక వ్యక్తి అబద్ధం లేక మోసం చేయగలగడం అవతలి వాడి అపనమ్మక శక్తి మీద ఆధారపడివుంటుంది. జీవితంలో నమ్మడం, నమ్మక పోవడం కూడా అవసరమే. అబద్ధం, నిజం అన్న పదాలకు ఒక్కొక సారి విలువ లేదేమో కూడా. అవి కేవలం పదాలు. పదం అంటే ఒక భావం యొక్క భాష. విలువా ఒక భావమే – జీవితా అవసరం."

అనంతానికి కావలసింది ఈ తాతాత్త్విక ఆలోచన కాదు; బ్రతుకుతెరువు కావాలి. ఒక యజమానితో ఇంతలా చర్చించడం అనవసరం; ప్రమాదకరం కూడా. అతనే దీనికి పూనుకున్నాడు. ముగిసిపోయేట్టుందిలే చర్చ అనుకుంటుండగా శరభయ్య కొనసాగించాడు. తన మనసును ఆ ఒంకతో శోధిస్తున్నాడా?

"నాకు అర్థం కానీ ఒక విషయం. నీ సామర్థ్యం మీద నువ్వు ఆధారపడి ఉద్యోగాన్ని సంపాయిద్దామని కాక మోహిని గారి సిఫారసు మీద ఎందుకు ఆధారపడినట్టు?"

ఆమె ద్వారా గోయలుకు చెప్పించి గోయలును ఉపయోగించి తన మీద ఒత్తిడి తెచ్చానన్న దుగ్ధ ఉందా?

"నన్ను ఉద్యోగంలో కొనసాగించడం లేక మాన్పించడం లో సామర్థ్యం లెక్కలోకి వస్తుంది, కేవలం సిఫారసు మీద నేను ఉద్యోగాన్ని సంపాదించడానికి అది కొంచంగా మాత్రమే ఉపయోగిస్తుంది. నాకన్నా మెరుగైన సమర్థుడితో పోటీ చేసి ఓడిపోలేదు; ఆ అవకాశం లేదు. నేనే మీ దగ్గిరకు వచ్చి ఉద్యోగం ఇవ్వండి అని అడిగుంటే, నా సామర్థ్యానికి పరీక్ష పెట్టి ఒక నిర్ణయం తీసుకుని ఉండేవాళ్ళు కాదుగదా. అలాంటి వ్యవస్థ లేనిచోట సిఫారసు తప్ప మరో గత్యంతరం లేక పోయింది. నా సిఫారసు నాకన్నా యోగ్యుడికి హాని చేయలేదు కూడా. మీకు అవసరం లేక పోయినా సిఫారసు వల్ల తీసుకోవలసి వస్తే మీరు దానిని నిందించ వచ్చు; మీ కంపెనీ ఉద్యోగ సత్రం కాదు. ఇప్పుడైనా నేను వెళ్లిపోవడానికి సంసిద్ధుడినే."

"నిన్ను చూస్తుంటే ప్రిన్స్ మిష్కిన్ గుర్తుకొస్తున్నాడు.

ఒక నిముషం తల వంచాడు అనంతం. తనకు అతనెవడో తెలీదని తన మీద దాన్ని ప్రయోగించాడా లేక తన మేధా లోతును కొలిచే ప్రయత్నంలో భాగమేనా? నాకూ ఆ పాత్ర దాస్తోవిస్కీ 'ఇడియట్' లాదని తెలుసనీ చెప్పడం అవసరమా; తెలిసీ తెలియనట్టు పట్టించుకో కుండా ఉండటం మేలా? తనకు ఆ పాత్ర గురించి తెలియదన్నట్లుండటం శరభ అహానికి ఆనందం, ఒక గెలుపు భావం కలిగిస్తాయేమో. అనంతం బలహీనమైన అహం అతన్ని ఊరుకోనీయ లేదు.

"అతని లాంటి వ్యక్తిని కాక పోయినా మేలే, అతని జీవితపు ఆఖరి మలుపు లాంటిది నా జీవితంలో ఎదురైై నేను భరించడం కన్నా లేక భరించ లేక పోవడం కన్నా."

"ప్రస్తుతానికి అతని మనస్తత్వంలా నీది ఉండొచ్చుగాని అతని జీవితం లాంటిదే నీది కాక పోవచ్చు. ఆ అంతం గురించి భయపడనక్కర లేదు."

"మీ లాంటి జ్ఞాని మార్గదర్శకత్వం ఈ ఉద్యోగంలో కొనసాగినంత వారికన్నా ఉంటుంది, అదొక మంచి జీవితావకాశం."

"తెగడ్తలకు కోపం ఒస్తుందిగాని నాకూ, పొగడ్తలు ఎందుకో నా మీద ప్రభావం చూపించ లేవు."

"మిమ్మల్ని ఉబ్బెయ్యాలన్నది కాదు నా ఉద్దేశం; ఒక నిజంగా నేను భావించినదానిని దాచుకో కుండా చెప్పటం."

శరభయ్య ఒక నిముషం పాటు మౌనంగా చూశాడు అనంతాన్ని. ఇన్ని తెలివితేటలూ, నిజాయతీ అక్కర లేని ఉద్యోగంలోకి అతన్ని తీసుకో వలసివచ్చింది. బంగారు కత్తి అని మెడ కోసుకోవడంలో తెలివి హీనతే కనబడింది. ఎంతో వినయంగా నడుము ఒంచి నిలబడి ఉన్న అనంతాన్ని పొమ్మని అనిపించ లేదు. పైగా గోయల్ బాధపడతాడు; ఎంతైనా ఈ కంపెనీ అతనిది.

"నిన్ను ఇంతసేపూ నిలబెట్టి మాట్లాడాను, అనంతం. నా అహం కూడా దానికి కారణం కావొచ్చు. ఒక్కో సారి ఎదుటి వ్యక్తితో అవసరం లేకపోయినా మంచిగా ఉండటంలో ఆనందముంటుంది. కూర్చో; దయ చేసి కూర్చో."

తాను ఈ సారి మంచి, మర్యాదా తెలిసిన వ్యక్తి చెంతన చేరడం తన అదృష్టంగా భావించాడు అనంతం. మోహినన్నా, గోయల్ అన్నా, అతని భార్యన్నా కృతజ్ఞతతో మది నిండి పోయిందా క్షణం. లోకంలో మంచి పూర్తిగా చావలేదు. ప్రతి వ్యక్తిలోనూ కొంత మేరకన్నా ఉండకపోదు. దాన్ని పెంచుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది; అది ఎలాగో అనంతానికి తెలియ లేదు. ఏ వ్యక్తికీ ఆ వ్యక్తి మంచిగా ఉండే ప్రయత్నమే దానికి మందు అనిపించింది.

"వామన గారికి వీలుంటే ఒకసారి రమ్మనయ్యా!" శరభయ్య ఎవరినో పిలిచి అన్నాడు.

ఐదు నిముషాలు గడచినా వామన రాలేదు. శరభ ఓపికలేని, కానీ ఉన్నట్టు కనిపించే, వ్యక్తి. అరుదుగా నైనా తాండవ నృత్యం చేస్తుంటాడు. వామన ఒచ్చే లోగా సమయాన్ని సద్వినియోగం చేయాలనిపించింది. సొరుగులో నుంచి తాంబూల సామగ్రిని పైకి తీసి బల్ల మీదికి చేర్చి ఒక యోగదీక్ష లోకి దిగాడు శరభ. అది సేవించడమే కాదు, ఆ కళాఖండాన్ని తయారుచేయడంలోనూ అనిర్వ చనీయమైన ఆనందం ఉంది. అది మందు కూడా; ఉద్రేకాగ్నిని

చల్లారుస్తుంటుంది. అది బుగ్గన చేరుతుండగా వామన ఒచ్చాడు. మౌనంగా, అనంతానికి కుడివైపున్న ఒక కుర్చీలో శబ్దం చేయకుండా కూర్చున్నాడు. శరభ వామన ఉనికిని గమనించనట్టు తల ఒంచుకుని తాంబూలం అతి నెమ్మదిగా నమిలి, ఊటను మింగుతూ రెండు నిముషాలు గడిపాడు. అలా తన సమయాన్ని ఒక నిముషం వృథా చేసినా వామనకు నచ్చదు; కావాలని చేస్తుంటే మరీనూ.  అతనికి నచ్చని పనులు ఎంతవరకు వీలయితే అంత వరకూ శ్రుతి మించి కుండా చేసి ఆనందించడం శరభకు ఇష్టం. అతని ఇష్టాలు వామనకు అనిష్టాలు.

"గోయాలు గారు అనంతం గారు అనే ఈ అందమయిన యువకుడిని ఉద్యోగంలోకి తీసుకో మన్నారని ఇంతకముందు చెప్పాను. పని ఒత్తిడిలో మీరు మర్చి పోయారో, గుర్తున్నదో నాకు తెలియదు. మీరు వచ్చేలోగా అతనితో చాలా తాత్త్విక విషయాలు ముచ్చటించాను. అవి విజ్ఞాన దాయకంగా ఉన్నాయి. పాదార్థిక విషయాలతోటే జీవితమంతా గడచి పోతోంది. ఆ విషయం పక్కనుంచి, అనంతం మేధా సంపత్తి గల వ్యక్తి అని తేల్చుకున్నా అతనితో మాట్లాడడం ద్వారా. నిజానికి అది ఒక ఇంటర్వ్యూ, ముఖాముఖీ. గోయాలు గారు ఏ పనైనా ఆచీ తూచీ చేస్తారు ఈ వయసులో కూడా. మోహిని గారనే ఒక మేధావి కుటుంబానికి, గోయాలు గారి కుటుంబానికీ స్నేహం. ఆమె మాట కాదనలేని అనుబంధం ఆ కుటుంబాల మధ్య ఉండుండవచ్చు – మనం వాటిల్లో తల దూర్చాల్సిన అవసరం లేదు. అతన్ని జాగ్రత్తగా మన పనికి వినియోగించండి. అతను ఏవన్నా సలహాలిస్తే వాటిని స్వీకరించడంలో తప్పులేదనుకుంటా; మీరూ ఆలోచించండి."

"అలాగే," అన్నాడు వామన వెంటనే లేచి పోయి.

ఎవరిపట్లనైనా కాస్త మర్యాదను చూపిస్తే తన అబ్బ గంటు పోతుందేమో అని వామన మీద చికాకుపడ్డాడు శరభ మనసులో.

అనంతానికి చూపుడు వేలు చూపించి తనను  అనుసరించమని సైగ చేశాడు. అనవసర పదాలు వాడటం అతనికి ఇష్టముండదు; ఎవరో అన్నట్టు అది దేశ ద్రోహంతో సమానమని అతని అభిప్రాయమూ. అభిప్రాయాలకు కాపీరైట్లూ లేవు. వెళ్లి పోతున్న ఇద్దరినీ రెప్ప వేయకుండా చూస్తున్నాడు శరభ.

ఒక గంట గడిచిందో లేదో కార్మికులు వామనతో సహా సమావేశ మందిరం చేరి శరభ ఉపన్యాసం గూరించి ఎదురుచూడటం మొదలుపెట్టారు. అతను ఒక్క నిముషం కూడా అనుకున్నసమయం గడవకుండా వచ్చి, గొంతు సవరించుకుంటూ ఉపన్యాసాన్ని మొదలుపెట్టాడు. తుమ్ములూ దగ్గులూ కూడా మానుకుని అందరూ చెవులు అప్పగించారు. ఎప్పుడన్నా అతను హెచ్చరింపులు, బెదిరింపులు, బుజ్జగింపులతో ఉపన్యాసం ఇస్తూ తన ఉపన్యాసాన్ని తానూ విని మురిసిపోవడం ఆనవాయితీ. ఏ కారణం వలన ఏ ఉపన్యాసం ఇస్తూండవొచ్చు అన్న విషయం వాళ్లకు జుత్తులు పీకున్నా ఊహించడం అసాధ్యం. అతని మనసు చవురు బావి కన్నా లోతైనది. ఆయనంటే భయం. ఏ మూల ఏమిజరుగుతోందా అన్నది ఆతను గ్రహించగలడు, దానికి తగు చర్య తీసుకోగలడు. అతను ఎవరితోనన్నా నవ్వుతూ

మాట్లాడినంత మాత్రానా ఆ వ్యక్తి మీద కఠినమైన చర్య తీసుకోడు అని భావించ రాదు. వాళ్ళు, అప్పుడప్పుడూ వచ్చే గోయల్ అన్నా అంత భయపడరు.

"తప్పూ లేక పాపం –పేరు ఏదైతేనేమి – దానికి తగిన శిక్ష అన్న వ్యవస్థ మీద నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. అవి లౌకిక, అలౌకిక వ్యవస్థలు. మీతో అవి పంచుకోడం వలన మీకు ఇబ్బంది కలుగదని భావవిస్తున్నాను. తప్పో, నేరమో, ఘోరమో చేసి దొరికితేనే కదా ఏ శిక్షాన్నా లౌకిక ప్రపంచంలో వేయడం సాధ్యం. ఏ తప్పూ చేయని వాడే తప్పు చేసిన వాడిని శిక్షించాలన్న నియమం లేదు; అది అసాధ్యం కనుక. ఒక న్యాయవ్యవస్థను సమాజం తప్పులు చేసే వాళ్లకి అప్పగించి ఏర్పరచుకున్న తరువాత, సామాన్య ప్రజలు శిక్షించే అధికారాన్ని తమ చేతుల లోకి తీసుకో కూడదు. ఏసు తప్పు చెయ్యని వాడు మొదటి రాయి విసరండన్నపుడు అది సమాజం ఏర్పరచుకున్న న్యాయ వ్యవస్థకు వర్తించదు; ఎందుకంటే ఆ న్యాయవస్థను నడపడానికీ ఏ తప్పూ చేయని వారు దొరకరు కాబట్టి. తప్పు చేసినా దొరకకుండా, శిక్షను అనుభవించకుండా మెసలగలిగే అవకాశాలను మనం కలిగి ఉన్నాం. లేకపోతె శిక్షకు గురికాని వాడు ఎవరూ ఈ లోకంలో ఉండరు. సంఘజీవులం కాబట్టి అలాంటి సంఘం అవసరం ప్రతి వ్యక్తికీ ఉంది. అలా జీవించడానికి అనుకొనని ఒప్పందం కలిగి ఉండి, నీతి నియమాలు, నడవడి సూత్రాలు కలిగి ఉన్నాం. అలౌకిక న్యాయ వ్యవస్థ నుంచి మాత్రం ఎవరం తప్పించుకో లేము అని బుద్ధుడు సెలవిచ్చాడు; ఆ వ్యవస్థ పేరు కర్మ. మన లౌకిక న్యాయ వ్యవస్థ లేక పోతే అల్లకల్లోలం జరిగి సంఘ వ్యవస్థ ఛిద్రమవుతుంది. తప్పులకు లేక నేరాలకు అంతుండదు. ఈ వ్యవస్థ ఉన్నంత మాత్రాన అంతా సజావుగా ఉందనుకోవడం వెర్రి వెంగళాయితనం.

"కర్మ సిద్ధాంతంలో ఎవడు ఏ తప్పుకు ఏ లేక ఎంత శిక్ష అనుభవిస్తున్నాడో మాత్రం మనకు తెలియదు; అది అన్యాయం అని ఎవరైనా భావిస్తే నేను తప్పు పట్టనుకూడా. న్యాయ వ్యవస్థలను ప్రశ్నించ కూడదన్న మాటతో కూడా నేను ఏకీభ వించలేను; న్యాయం జరగాలని ఇక్కడైనా, పైనైనా కోరుకునే మొదటి వ్యక్తిని నేను ఈ ప్రపంచంలో.

"నాకు ఉపన్యసించడంలోనూ నీతి బోధ చేయడంలోనూ ఆట్టే ఆసక్తి లేదు; కానీ ఒక సంస్థను నేను నడిపిస్తున్నపుడు నేను చెప్పింది ఆచరించడం, అప్పుడప్పుడూ [మీరు విన్నా వినకపోయినా] ఉపన్యాసాలకు పూనుకోవడం అనివార్యమైన పని. ఆధునిక యాజమాన్య పద్ధతులలో ఇదీ ఒహటి. మన ఈ కుటుంబంలో సమిష్టిగా సంపద సృష్టిస్తున్నాం; గోయల్ గారి గురించి మాత్రమే కాదు మనందరి గురించి. భాగస్వామ్యానుసారం సంపదను సామర్థ్యం ప్రాతిపదికగా పంచుకుంటున్నాము. ఒకరు మనలో దొంగతనం చేస్తే ఆ పోయే సొమ్ము అందరిదీని. కనుక దొంగతనం చేయకపోవడం ఒక అవసరం, అది జరగకుండా ఒళ్ళంతా కళ్లుగా నిఘా వేసుండటం మరోక అవసరం. ఎలుకలను అందరమూ పెద్ద కర్రలు చేతపూని దండించాలి."

ఊపిరి పీల్చుకోడానికన్నట్టు ఒక నిముషం వాచీ వైపు చూస్తూ మాటలు ఆపాడు. ఎందుకో అనంతం వైపు చూశాడు; చూపు మరల్చాడు.

"ఈ సంస్థలో గాని మరో చోట గాని తన తప్పు ఎవరూ గమనించడం లేదు అని ఎవరూ భావించకూడదు. పిల్లి పాలుజుర్రుకుంటూ అలానే భావిస్తుందని (ఎలా తెలిసిందో) ఎవరో చెప్పారు. మీ నీతీనిజాయితీలు మీ ఉద్యోగాలకు రక్షణ కవచాలు. అల్లా వాడు ఆ దొంగతనం చేయ లేదా నేను చేస్తేనే తప్పొచ్చిందా అని వాదించడం మూర్ఖత్వంగాను, అలా వాదించడం కూడా శిక్షార్హమే అనీ నేను నమ్ముతాను, రోజులెలా ఉన్నాయి? గుడిని, గుళ్లో లింగాన్నీ ఆరగించేలా ఉన్నాయి. ఒక్క లింగం పొతే మరో లింగంతో నష్టాన్ని సరిపెట్టుకో వచ్చు. గుడి మొత్తాన్ని మింగేస్తే లింగమూ, గుడీ కొత్తగా ఏర్పాటు చేసుకో వాలని మీకు తెలుసు. దేవుళ్ళకే రక్షణ లేని దినాలివి; తనకు జరిగే నష్టాన్ని దేముదు ఒక నవ్వు నవ్వి ఉపేక్షిస్తాడు. మీకు జరుగుబాటు లేకపొతే నా దగ్గరకు వచ్చి చెప్పుకోండి తగు ఉపాయం ఆలోచిద్దాము. ఈ సంస్థను పాపాయిని ఉంచినట్టు నా చేతుల్లో గోయల్ గారు ఉంచారు; కష్టనష్టాలకోర్చి దాన్ని సాకుతున్నాను. మానవత్వం ఉన్న నా యజమాని నాలోనూ మానవత్వం ఉందనిభావించడం వలన ఈ గురుతర బాధ్యత నాకు అప్పగించి తాను కృష్ణారామా అనుకో గలుగుతున్నారు. వయసు మీరిన తార్వాత నేనూ మీరూ కృష్ణుడిని, రాముడిని తలచుకోక తప్పదు."

దొంగ లెక్కలు రాయమనేవాడు వామన. అవి వ్యక్తిగత లబ్ధికి మాత్రమే ఉద్దేశించబడినవని అనుకోవడానికి వీలు లేదు. కొంత స్వామి కార్యం, మరికొంత స్వకార్యం. దొంగ లెక్కలని అతను అనంతానికి చెప్పక పోవడం వలనా, అనంతం గ్రహించలేక పోవడం వలన కొంత కాలం ఆ లెక్కలు అలా సాగాయి. అతని దస్తూరిని వామన ముత్యాలతోను, రతనాలతోనూ పోల్చుతుండటం వలన లోతుగా వాటి గురించి ఆలోచించే వాడు కాదు అనంతం. ఆ లెక్కలు అందమైన అబద్ధాలు. అబద్ధం అందమైన దైనప్పుడు సత్యం ఎక్కువగా మరుగున పడుతుంది. ఏ పనన్నా అచంచలమైన ఏకాగ్రతతో చేస్తున్నపుడు దృష్టి మరో దాని మీదకు పోదు – అనంతానికైనా, అర్జునుడికైనా. ఒకనాడు జ్ఞానోదయం అయింది అనంతంకే. ఆ రాత్రి నిద్ర మానుకున్నాడు. వామనది పొరపాటా కావలసి చేయించిన పనా? పొరబాటు కాకపొతే వామనలొ దొంగున్నట్టే. దొంగతో తెలిసి పనిచేసినా తెలియక చేసినా అది దొంగతనంగానే భావించాలని అనంతం భావించాడు. దొంగకు కనీసం దొంగ సొమ్మన్నా దక్కుతుంది; తెలియకుండా సహకరించిన వాడికి అదీ దక్కదు. అనంతం ఏదన్నాదక్కుంటే బావుందు కదా అని కలలో కూడా భావించ దలచలేదు, అది వేరే విషయం. అంత త్వరగా ఒక నిర్ణయానికి రావడమూ హానికరమే అన్న ఉద్దేశం కలిగింది. ముందు తాను దాన్ని పట్టించుకోక పోవడమే శ్రేయస్కరం అనిపించినా, నిఘా పెట్టదలచాడు పరోక్ష దొంగగా తెలియకుండా కూడా మిగిలిపోవడం ఎప్పటికి ఇష్టపడని అనంతం. విచారం కలిగింది. దాన్ని ఎవరితోనూ పంచుకునే అవకాశం అతనికి ప్రస్తుతం లేదు. తనది పొరబాటని తేలితే పోయేది తన ఉద్యోగం.

వామన అల్లింపించిన అందమైన తప్పుల తడకను అతనికి అన్ని మర్యాదలూ పాటిస్తూ అనంతం చూపించాడు. అహం తాచు లాంటిది; బుట్టలో నుంచీ జాగ్రత్తాగా తీయాలి. వామన చాలా ఆశ్చర్యపడ్డాడు రెండు కారణాల వల్ల. ఒకటి తప్పులను అనంతం కనుగొనగలగడం, రెండు తనతో వాటిని అనంతం ధైర్య సాహసాలతో ప్రస్తావించడం.

"నీవు చెప్పినది అక్షరాలా, అంకెలారా నిజం. నిజాలు ధైర్యంగా చెప్పేవాళ్లంటే శరభ గారి లాగే ఏంతో ఇష్టం నాకు. అలా అని అబద్ధాలాడే వాళ్లంటే ఎందుకో ద్వేషమూ ఉండదు. నిజాయతీగా మాత్రమే ఉంటా అని కోడిలా కొంపెక్కి కూస్తే నిరసనను వ్యక్తం చెయ్య లేను.  పరస్పర విరుద్ధ ధోరణి మానవనైజంలో అంతర్లీనంగా ఉండేదే అని నీకుచెప్పక్కర్లా. ఒక రోజు నీ తెలివితేటల గురించి సుదీర్ఘంగా శరభ గారు చెప్పారు."

అతని మాటలు ప్రోత్సాహకరంగా ఉండటం వలన వామనవి పొరబాటు లెక్కలన్న నమ్మిక కలిగింది అనంతానికి. నాల్రోజులు ఆగి మరో తప్పు పట్టి ప్రశంసలు పొందాడు. వామన ఒక మంచి నవ్వు కూడా నవ్వాడు.

"చిన్నప్పుడు లెక్కలు ఒంటబట్టలేదు; తొడ పాశాలతో తొడలన్నీ కందిపోయాయి. ఒక సారి పంతులు గారిని చాచి లెంపకాయ వేద్దామన్న కోరికను అణచుకోవడం వలన ఆయన బ్రతికి బట్టగట్టి అప్పుడప్పుడూ వీధిలో తారస పడితే ఆప్యాయంగా పలకరిస్తుంటాడు గుర్తు పట్టి. నీవు చుర కత్తిలాంటి కుర్రవాడివి; నీ మీసాలూ రెండు అందమైన చురకత్తులు. నీవు గాలం వేసి చాపల్లా తప్పులు పట్టక పోతే ఎంత నష్టపడే వాళ్ళమో. నిజాయతీకి శరభ గారే కాక, గోయల్ గారూ ప్రాణాలు అర్పించే రకం. వాళ్ళ వాసన నాకు అంటింది. నీలాంటి వాళ్ళ అవసరం కంపెనీకి ఎంతైనా ఉంది. నిన్ను ఎప్పటికీ ఒదులుకోము.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS